ప్రజాశక్తి

బుధవారం 19 జూన్ 2024 | 5 | విజయనగరం

ఐటిఐలో ప్రవేశాలకు నేటి నుంచి కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 19 నుంచి 26వరకు ఐటిఐల్లో ప్రవేశాలకు కౌన్సిలింగ్ జరుగుతుందని ప్రభుత్వ ఐటిఐ విద్యాసంస్థల జిల్లా కన్వీనర్ టివి గిరి తెలిపారు. కౌన్సిలింగ్ షెడ్యూల్ ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకొని ధ్రువపత్రాలు పరిశీలన చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ జాబితా ప్రకారం కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు తమ పదో తరగతి జిపిఎ మార్కులు ఆధారంగా కేటాయించిన ర్యాంకులను బట్టి వారికి కేటాయించిన తేదీల్లో ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కౌన్సిలింగ్ కొనసాగుతుందని తెలిపారు. అభ్యర్థుల మొబైల్ నెంబర్లకు ర్యాంకు, హాజరు కావాల్సిన కౌన్సిలింగ్ తేదీని మెసేజ్ ద్వారా తెలియజేసినట్లు పేర్కొన్నారు.

వాలంటీర్లు, ఫీల్డు అసిస్టెంట్లలో గుబులు

- తమకు అవకాశం కల్పించాలంటున్న తెలుగు తమ్ముళ్లు
- గతంలో జీవనోపాధిని దెబ్బతీశారంటూ మరికొందరు
- గ్రామ స్థాయిలో సిద్ధమవుతున్న జాబితాలు
- ఎమ్మెల్యేలకు, అధికారులకు విజ్ఞాపనలు

తమను కొనసాగించాలని కలెక్టర్‌కు వినతినిచ్చేందుకు వచ్చిన వాలంటీర్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇప్పుడే కాదు... కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు, పాలకులు చూపిన పక్షపాత వైఖరి, కక్షసాధింపు చర్యలు, బంధుప్రీతితో గ్రామ స్థాయిలోని గ్రామ వాలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశావర్కర్లు నలిగిపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో కొందరి గుండెల్లో గుబులు మొదలైంది. ప్రతి ఐదేళ్లకోసారి ఇటువంటి దుస్థితి ఉంటోంది. జిల్లాలో ఈసారి మరీ ఎక్కువగానే కనిపిస్తోంది.

గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతి 50 ఇళ్లకు ఓ వాలంటీర్ చొప్పున నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 626 గ్రామ సచివాలయాల పరిధిలో 10,828 మంది వాలంటీర్లను నియమించి, వారికి రూ.5వేల చొప్పున పారితోషికం చెల్లిస్తున్న సంగతి తెలిసిందే. అప్పట్లో కొన్ని గ్రామాల్లో మినహా మిగిలిన అన్నిచోట్లా వైసిపి కార్యకర్తలనే వాలంటీర్లుగా నియమించారు. వీరిని ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దంటూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేయడంతో వైసిపి ప్రభుత్వం నాలుక కొరుక్కుంది. పార్టీ కోసం వాలంటీర్లంతా రాజీనామాలు చేసి వైసిపి గెలుపునకు కృషి చేయాలంటూ అప్పట్లో జగన్ ప్రభుత్వం చెప్పింది. జగన్ పిలుపే తడవుగా 'మాంసం తిన్నామంటూ దుమ్ములు మెడలో వేసుకున్న చందంగా' జిల్లా వ్యాప్తంగా 6,588 మంది రాజీనామాలు చేశారు. ఇటీవల టిడిపి ప్రభుత్వం మారడంతో తమను తొలగించి, టిడిపి కార్యకర్తలను పెట్టుకుంటారనే భయం చాలా మంది వాలంటీర్లలో వ్యక్తమౌతోంది. అందుకు తగ్గట్టే 'రాజీనామా చేయని వాలంటీర్లందర్నీ కొనసాగిస్తాం' అంటూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఓ కార్యక్రమంలో మంగళవారం ప్రకటించారు. దీంతో, జిల్లాలోని మెజార్టీ వాలంటీర్లలో ఆందోళన నెలకొంది. ఈనేపథ్యంలోనే చీపురుపల్లికి చెందిన కొంతమంది వాలంటీర్లు రాజీనామా చేసిన తమను కొనసాగించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతినిచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. వాలంటీర్ల నియామకాల్లో పేదలని చూడకుండా వైసిపిలో ఉన్నవారికి మాత్రమే ఇచ్చారనేది గ్రామ స్థాయి టిడిపి నాయకుల వాదన. నిరుపేదలకు కూడా అవకాశం ఇవ్వలేదని వారు ఆరోపిస్తున్నారు.

గ్రామీణ ఉపాధి హామీలో పనిచేస్తున్న మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లలలో చాలా మందిపై గత ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడింది. బొండపల్లి మండలం ముద్దూరు ఫీల్డ్ అసిస్టెంట్‌గా వైసిపి కార్యకర్తను నియమించుకునేందుకు సుమారు 15ఏళ్లుగా పనిచేస్తున్న బాలి భాగ్యలక్ష్మిపై స్థానిక నాయకులు అవినీతి ఆరోపణలు చేశారు. అప్పటి ఎమ్మెల్యే అప్పల నర్సయ్య ఒత్తిడితో తొలగించాలని నిర్ధారణకు వచ్చిన అధికారులు కూడా అందుకు వంత పాడుతూ తొలగింపు ఉత్తర్వులు జారీచేశారు. దీనిపై ఫీల్డ్ అసిసెంట్ సవాలు చేస్తూ జిల్లా కలెక్టర్ కోర్టుకు వెళ్లారు. మరికొందరు ఏకంగా జిల్లా, హైకోర్టులకు కూడా వెళ్లినట్టుగా సమాచారం. ఇవి మచ్చుకు మాత్రమే జిల్లా ఎంతో మంది గత ప్రభుత్వ హయాంలో వేధింపులతో జీవనోపాధి కోల్పోయారు. వీరంతా ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో తమను ఆదుకోవాలంటూ ఎమ్మెల్యే, మంత్రులకు విన్నపాలు చేస్తున్నారు. మరోవైపు ఇలాంటి సమస్య లేనిచోట కూడా తమ కోసం పనిచేసినవారికి ఏదో ఒకటి చేయాలనే తలంపుతో చాలా కాలంగా పనిచేస్తున్న మేట్‌లను, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను మార్పుచేసేందుకుతహతహలాడు తున్నారు. ఈ మేరకు గ్రామాల్లో పార్టీల ప్రాతిపదికన జాబితాలు తయారు చేసి స్థానిక ఎమ్మెల్యేలకు ఇచ్చేందుకు సన్నద్ధమౌతున్నారు. మరోవైపు ఇప్పటికే ప్రభుత్వ మద్యంషాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది తమను కొనసాగించాలంటూ ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతులు ఇస్తున్నారు. వారిలో కూడా తొలగిస్తారేమోనన్న ఆందోళన నెలకొంది.

మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సంధ్యారాణి

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

సేవ చేసి రుణం తీర్చుకుంటాం
గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-విజయనగరం కోట

గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి, తాగు, సాగునీరు అందించే విధంగా కృషిచేస్తానని గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ప్రజలకు సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానని తెలిపారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో ఎఎన్‌ఎంల నియామకంపైనే తన తొలి సంతకం చేశానని చెప్పారు. మంగళవారం జిల్లా టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాకు వచ్చిన ఆమెకు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, టిడిపి నాయకులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గిరిజన విద్యార్థులు మరణాలను అరికట్టేందుకు ప్రతి హాస్టల్‌లోనూ ఒక ఎఎన్ఎంను నియమిండ చేందుకు తొలి సంతకం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోను,జిల్లాలోను గత ఐదేళ్లలో ఐటిడిఎలను నిర్లక్ష్యం చేశారని, ఫీడర్ అంబులెన్స్‌లు లేక గిరిజనులకు డోలి కష్టాలు తప్పలేదని అన్నారు. గత ఐదేళ్లలో జరిగిన ప్రతి అక్రమంపైనా విచారణ చేయిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, పిల్ల విజయ్ కుమార్ , కాళ్ల గౌరీ శంకర్, కంది మురళి నాయుడు, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

నీ వెంటే నేను..

- భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి
- కొప్పర వలసలో విషాదం

శ్రీరాములు

చిన్న తల్లి (ఫైల్)

ప్రజాశక్తి - వంగర

కష్ట సుఖాల్లో ఒకరొకరం తోడుంటామని ఏడడుగులు నడిచిన ఆ దంపతులు మరణంలోనూ నీ వెంటే నేను అంటూ కొద్ది సమయం వ్యవధిలోనే కన్ను మూశారు. మండలంలోని కొప్పర వలసలో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. . గ్రామానికి చెందిన బొద్దూరు శ్రీరాములు (60)అనారోగ్యంతో మతి చెందగా..గంటల వ్యవధిలోనే ఆయన భార్య బొద్దూరు చిన్న తల్లి (55)హఠాత్తుగా మరణించింది. ఈ విషాద ఘటన అందరినీ కలిసి వేసింది. వివరాల్లోకి వెళితే.. కొప్పరవలస గ్రామానికి చెందిన బొద్దూరు శ్రీరాములు రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీరాములును చికిత్స కోసం ఇటీవల విశాఖపట్నం కెజిహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈనెల 17న ఆయన మృతి చెందాడు. మృతదేహన్ని సోమవారం రాత్రి స్వగ్రామం తీసుకురావడంతో భార్య చిన్న తల్లి బోరున విలపించింది. ఒకరికి ఒకరు... తోడూ నీడగా జీవనం సాగించిన ఆమె భర్త లేని విషయాన్ని జీర్ణించుకోలేక ఆయన మృతదేహం వద్ద రోదిస్తూ చిన్న తల్లి మంగళవారం వేకువజామున మృతి చెందింది. ఈ విషాద ఘటన చూసిన వారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. వీరికి కుమారులు రాము, రామిశెట్టి తో పాటు ఒక కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. వారి మృతదేహాలకు గ్రామ సమీపంలోని శ్మశాన వాటిక వద్ద ఒకేచోట చితి పేర్చి దహనం చేశారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన

డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై క్షేత్రస్థాయిలో సిబ్బంది అవగాహన కల్పించాలని డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా బుధవారం అన్ని ఆరోగ్యకేంద్రాల్లో అవగాహన సదస్సులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలసట మొదలైనవి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలని తెలిపారు. ఇది వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమని, ఇవి మన రక్తంలో ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోప బూయిష్టంగా ఉంటాయని తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహక కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిఎల్‌టిఒ డాక్టర్ రాణి, డిఐఒ డాక్టర్ అచ్యుత కుమారి, ఆర్‌బిఎస్‌కె కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర నాయకులు వెంకట్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర నాయకులు పి.వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్‌నావు అధ్యక్షతన ఇంజినీరింగ్ కార్మికుల సమావేశం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో జరిగింది. ముఖ్య వక్తలుగా హాజరైన యూనియన్ రాష్ట్ర నాయకులు పి .వెంకట్ రెడ్డి, ఎన్ వై నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడారు. 2023 డిసెంబర్ 26 నుంచి జనవరి 11 వరకు జరిగిన సమ్మె సందర్భంగా ప్రతిపక్ష టిడిపి నాయకులు వచ్చి 2019 ఫిబ్రవరి 18న చంద్రబాబు తెచ్చిన జీవో ఎంఎస్ నెంబర్ 96 ప్రకారం బేసిక్ డిఎ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుత అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం కార్మికులకు బేసిక్ వేతనం, డిఎతో కలిపి రూ.25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 9 మంది ఐఎఎస్ అధికారులతో వేసిన కమిటీ సిఫార్సుల మేరకు స్కిల్, సెమీ స్కిల్, అన్‌స్కిల్ వేతనాలు అమలకు ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల నుంచి 19 శాతం జిఎస్‌టిని వసూలు చేసే ఆప్కాస్‌ను రద్దు చేయాలని కోరారు. విజయనగరం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పంప్ హౌస్ కార్మికులకు కనీస వేతనాల జీవో ఎంఎస్ నెంబర్ 7 అమలు చేయాలన్నారు. 4నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లాలో సంక్రాంతి కానుక 1000 రూపాయలు ఇంజినీరింగ్ కార్మికులకు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. 10,11 వ పి ఆర్‌సి ల్లో ఇంజినీరింగ్ కార్మికులకు జరిగిన అన్యాయాన్ని 12వ పిఆర్‌సిలో సవరించాలని, జీవో నెంబర్ 1615 ప్రకారం జీతాలు చెల్లించే విధంగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై ఈనెల24న కలెక్టర్‌కు, 25,26 తేదీల్లో మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజు, ఆదినారాయణ, మురళి, నారాయణ రావు, రఘు, సురేష ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు వెంకట్‌రెడ్డి

పారాది కాజ్‌వేను వెంటనే పునరుద్ధరించండి

- గ్రామాల్లో తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టండి
- ఎంఎన్ ఛానల్ ద్వారా గజపతినగరానికి సాగునీరు
- రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం నుంచి మన్యం జిల్లాతోపాటు ఒడిషా రాష్ట్రాన్ని అనుసంధానించే అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న పారాది కాజ్‌వేను వెంటనే పునరుద్దరించాలని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని రూపొందించడంతోపాటు, ప్రస్తుతం వాహనాల రాకపోకలకు వీలుగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. తాత్కాలికంగా వెంటెడ్ కాజ్‌వేను నిర్మించాలని సూచించారు. పంచాయతీరాజ్, నీటిపారుదల, ఆర్ అండ్ బి, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణం తదితర శాఖల ఇంజినీరింగ్ అధికారులతో జెడ్‌పి అతిథి గృహంలో మంత్రి శ్రీనివాస్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల కార్యకలాపాలు, ప్రస్తుత ప్రాజెక్టుల స్థితిగతులను తెలుసుకున్నారు.

జిల్లాలో ముఖ్యమైన రహదారులు, వాటి స్థితిగతులను మంత్రి ఆరా తీశారు. చిన్నచిన్న కారణాలతో, బిల్లులు చెల్లించక పెండింగ్‌లో ఉండిపోయిన రహదారుల గురించి ఆర్ అండ్‌బి ఇఇ జేమ్స్‌ను ప్రశ్నించారు. చేపట్టాల్సిన తక్షణ చర్యలపై సమీక్షించి, వాటికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితి, నీటి లభ్యత గురించి నీటిపారుదల శాఖ సమీక్షలో మంత్రి తెలుసుకున్నారు. చిన్న, మధ్యతరహా, భారీ ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటి పరిస్థితి, ప్రాజెక్టుల పెండింగ్ పనుల గురించి నార్త్ కోస్టల్ సిఇ శంబంగి సుగుణాకరరావు, ఇఇ అప్పలనాయుడు మంత్రికి వివరించారు. ప్రస్తుతం తోటపల్లిలో నీటి లభ్యత సంతృప్తికరంగా ఉందని, ఆంధ్ర ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీకి చేరుకుందని వారు తెలిపారు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పూర్తయితే, భోగాపురం విమానాశ్రయానికి నీటి అవసరాలు తీరుతాయని చెప్పారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేసేటప్పుడు తమతోపాటు, సంబంధిత ఎమ్మెల్యేలకు కూడా సమాచారాన్ని ఇవ్వాలని మంత్రి సూచించారు. గజపతినగరానికి ఆంధ్ర రిజర్వాయర్ నుంచి ఎంఎన్‌ఛానల్, కొణిశ ఛానల్ ద్వారా సాగునీరు అందించేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు.

గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఉమాశంకర్‌ను మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి లభ్యత, ప్రస్తుత సరఫరా, జలజీవన్ మిషన్ పనుల గురించి సమీక్షించారు. జిల్లాలోని చిన్న, భారీ రక్షిత నీటి సరఫరా పథకాలు, వాటి నిర్వహణ, బోరు బావులు, వాటి పరిస్థితి, జెజెఎం పనుల గురించి ఎస్‌ఇ వివరించారు. గ్రామం వారీగా తాగునీటి పరిస్థితిపై తమకు సమగ్ర నివేదికను అందజేయాలని సూచించారు. ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీటిని అందించడమే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతాంశమని మంత్రి స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న పనులు, వాటి పరిస్థితి గురించి ఎస్‌ఇ విఎస్‌ఎన్ మూర్తి వివరించారు. ముఖ్యమైన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. గృహనిర్మాణం గురించి హౌసింగ్ పీడీ శ్రీనివాస్ మంత్రికి వివరించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కాలనీలు, ఇళ్లు, వాటి స్థితిగతులను వివరించారు. ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీమ్ పెండింగ్ బిల్లుల గురించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరా తీశారు. సమావేశంలో పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

21న జాబ్ మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు అపోలో టైర్స్ , మోడలేజ్ ఇండియా ఫుడ్ ప్రైవేటు లిమిటెడ్, పాపులర్ షూ మార్ట్‌లలో 240 ఉద్యోగ ఖాళీలకు ఈనెల 21న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి. అరుణ ఒక ప్రకటన లో తెలిపారు. విజయనగరం తుపాకుల వీధిలో గల ఎం.ఆర్ కళాశాల వద్ద ఈనెల 21 న ఉదయం 10 గంటలకు అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. అర్హత ,ఆసక్తి గల అభ్యర్థులు తమ పేర్లను employment.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికేట్లు , బయో డేటా ఆధార్ కార్డు, కుల సర్టిఫికేట్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని జాబ్ మేళా కు హాజరు కావాలన్నారు. వివరాల కోసం 89191 79415 నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

నగరాభివృద్ధికి సహకరించాలి : మేయర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. . మంగళవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ ఎం.ఎం. నాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి పాల్గొన్నారు. సమావేశంలో అజెండాలోని పొందుపరిచిన 18 అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాలపరిమితిలోగా అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని అన్నారు. నిర్లక్ష్యం వహించే సిబ్బంది పట్ల ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, అధికారులు పాల్గొన్నారు.

దర్గాను దర్శించిన మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని బాబామెట్టలోగల సూఫీ పుణ్య క్షేత్రం హజరత్ సయ్యద్ ఖాదర్ వలీ దర్గాను రాష్ట్ర సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసు దర్శించుకున్నారు. ఆయనకు ఖాదర్ వలీ బాబా దర్గా, దర్బార్ షరీఫ్ ధర్మకర్త(ముతవల్లి) డాక్టర్ ముహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ(ఖలీల్ బాబు) స్వాగతం పలికారు. అంతకుముందు మంత్రికి ధర్మకర్త ఖలీల్ బాబు సూఫీ సంప్రదాయం ప్రకారం సూఫీ మహనీయుల శేష వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి వెంట టిడిపి నాయకులు మక్కువ శ్రీధర్, కొండపల్లి భాస్కర్ నాయుడు, కంది మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా బ్రెస్ట్ స్క్రీనింగ్ పరీక్షలు బుధవారం నుంచి తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహిస్తామని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు,రోటరీ మెయిన్ క్లబ్ అధ్యక్షులు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కృష్ణ శాంతి తెలిపారు. స్థానిక తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో బ్రెస్ట్ స్క్రీన్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్తేరు రోటరీ క్లబ్ సహకారంతో విజయనగరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు ఉచితంగా బ్రెస్ట్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఎటువంటి రేడియేషన్ సమస్యల్లేని బ్రెస్ట్ ఎగ్జామినేషన్ డివైస్ బ్రెస్ట్ మాస్ మిషన్ సహకారంతో బ్రెస్ట్ లో గడ్డలు ఉంటే కనిపెట్టవచ్చని తెలిపారు. ఈ గడ్డలను ప్రాథమిక స్థాయిలో తెలుసుకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. సుమారు ఆరు నెలలపాటు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ బ్రెస్ట్ మాస్ మిషన్ సహకారంతో 15 నుంచి 25 ఏళ్ల యువతలకు, ఆ వయస్సు పైబడిన మహిళలకు ఉచితంగా పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. తిరుమల మెడికవర్ ఆసుపత్రితో పాటు మిగిలిన ఆసుపత్రులలోనూ, విద్యా సంస్థలలో కూడా ఈ పరీక్షలు నిర్వహిస్తా మన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ తిరుమల ప్రసాద్, సెంట్రల్ హెడ్ పద్మ కుమార్, ఆర్‌కె జైన్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు చూస్తున్న నకిలీ బంగారం మోసాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బంగారం కొనుగోలు చేస్తే నకిలీ బంగారం ఇచ్చి మోసం చేసిన సంఘటన బొబ్బిలిలో వెలుగు చూసింది. బాడంగి మండలం గొల్లాది గ్రామానికి చెందిన వృద్ధురాలు బంటు సూరమ్మ పట్టణంలోని సుధ జ్యువెలరీ షాపులో 2017లో అదే గ్రామానికి చెందిన యామల అప్పలనాయుడును తీసుకుని బంగారం కొనుగోలు చేసేందుకు వెళ్లింది. పుస్తెలు తాడు కోసం పాత బంగారం తులం ఇవ్వగా కొత్త బంగారం మరో తులం కొనుగోలు చేసి రెండు తులాల పుస్తెలు తాడు చేయించి కుమారుడికి తెలియకుండా బీరువాలో దాచింది. నెల రోజుల క్రితం పుస్తెలు తాడును బయటకు తీసి వాడగా రంగు పోవడంతో అనుమానం వచ్చి నాణ్యత పరిశీలించగా నకిలీ బంగారమని తేలడంతో షాపు వద్దకు వెళ్లి నిలదీసింది. తాము ఇచ్చిన బంగారం కాదని యజమాని మాట మార్చడంతో పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. నకిలీ బంగారం ఇచ్చిన వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూరమ్మ కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.



బంగారు షాపు యజమానిని నిలదీస్తున్న బాధితులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు

సమస్యలపై దృష్టి పెట్టండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం కోట

సమస్యలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. విజయనగరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వ ఆయా వార్డులు, గ్రామాల వారీగా ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ కార్యాలయానికి తెలియజేయాలని, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ప్రజల పట్ల మన పార్టీ సభ్యులు అందరూ చాలా బాధ్యతగా ఉండాలన్నారు. ఈ బాధ్యతను అజమాయిషీ చెలాయించడానికి ఇవ్వలేదని, కోలగట్ల వీరభద్ర స్వామి చేసినట్టు బలవంతం వసూళ్లు చేయడానికి ఇవ్వలేదని గుర్తించాలని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఇచ్చిన హామీ ప్రకారం సంతకాలు పెట్టి ప్రజల కోసం పనిచేయడానికి టిడిపి ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో ఉందో తెలియజేశారని, అదేవిధంగా మనం కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా పని చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, ఎంపిటిసి రాజేష్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు కార్యదర్శి గంటా పోలినాయుడు రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోలు వాయిద్యం ఆడిషన్‌కు సత్యనారాయణ

బొబ్బిలి: విశాఖ ఆకాశవాణి రేడియో స్టేషన్ నిర్వహిస్తున్న డోలు వాయిద్యం ఆడిషన్‌కు బొబ్బిలి మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన కింజంగి సత్యనారాయణ ఎంపికయ్యారు. జూలై 4న విశాఖలో జరగనున్న ఆడిషన్‌కు హాజరు కావాలని సత్యనారాయణకు ఆహ్వాన పత్రికను పంపించారు. సత్యనా రాయణ విజయం సాధించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సత్య నారాయణను గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

తెర్లాం: అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపిపి ఎం. ఉమాలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలకు అనుగుణంగా సభ్యులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలన్నారు. ఎఒ సునీల్ మాట్లాడుతూ మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కొన్ని రకాల వరి విత్తనాలు సాంబ మసూరి, 1121 కొత్త రకం విత్తనాలు ఈ సంవత్సరం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఎంపిడిఒ మధుసూదన్ రావు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో విధి విధానాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంఇఒ త్రినాధరావు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, రమాదేవి, జెడ్‌పిటిసి పి. రాజ్యలక్ష్మి ఎంపిటిసిలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని విధుల్లోకి తీసుకోండి

బొబ్బిలిరూరల్: తమను విధుల్లోకి తీసుకోవాలని అలజంగి గ్రామానికి చెందిన వాలంటీర్లు మంగళవారం ఎంపిడిఒ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ, కోవిడ్ సమయంలో కూడా ప్రజలకు అనేక సేవలు అందించామని తమపై గత ప్రభుత్వ బలవంతపు రాజీనామాలు చేయించడంతో తాము ప్రస్తుతం చాలా ఇబ్బందులు పడుతున్నామని వారన్నారు. ఈ రాజీనామాలు ఆమోదించకుండా తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు ఆర్.మహేష్, జి.పద్మ, ఎ.భారతి, వై.శ్రీదేవి, జి.మోహిని, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు వ్యాక్సినే మార్గం

మెంటాడ: క్షయవ్యాధి నిర్మూలనకు బిసిజి వ్యాక్సినే మార్గమని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి లోకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బిసిజి వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల క్షయవ్యాధి నివారణ చేసుకోవచ్చునని, చుట్టుపక్కల క్షయవ్యాధి గ్రస్తులున్నట్లయితే ఆరోగ్యవంతులకు ఈ వ్యాధి సోకకుండా వుండటానికి చెప్పారు. సోమ, గురువారాల్లో ఆరోగ్య సిబ్బంది తమ ఇళ్ల వద్దకు వచ్చి టీకాలు వేస్తారని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ సర్పంచ్ కుమార్తెకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

శృంగవరపుకోట: ఎల్.కోట మండలం రంగాపురం గ్రామానికి చెందిన టిడిపి మాజీ సర్పంచ్ దాశరధి దేముడు నాయుడు గత సంవత్సరం అనారోగ్య కారణాలతో మరణించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టిడిపి నాయకులు రాంప్రసాద్ దేముడు నాయుడు కుమార్తె గ్రీష్మ ఇంజనీరింగ్ చదువు బాధ్యత తాము చూసుకుంటామని గతేడాదే హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రెండో సంవత్సరం ఫీజ్ నిమిత్తం మంగళవారం రూ. 50వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లి ఈశ్వరరావు, కొట్యాడ ఈశ్వరరావు, వెలమ సాధికార సమితి కన్వీనర్ లాలం అర్జున్ రావు, అక్కిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పై అప్రమత్తం

పూసపాటిరేగ : వర్షాకాలం కారణంగా పారిశుధ్యం పై గ్రామపంచాయతీలో అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ అన్నారు. మంగళవారం మండలంలోని చల్లవానితోట గ్రామపంచాయతీ యాతపేటలో పారిశుధ్య కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. మంచినీటి బోరు వద్ద శుభ్రపరిచి రానున్న వర్షాకాలం దృష్ట్యా డయేరియా రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలను పరిశీలించి నీరు వృథా కాకుండా స్కూల్లో టిపేలు ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంకి ఆదేశించారు. పిల్లలకి పెట్టే భోజనం పరిశీలించి ఈగలు రాకుండా ఫినాయిల్ స్ప్రే చేయాలన్నారు. ఆమెతోపాటు పంచాయతీ అధికారి డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఉపకార వేతనానికి పసుపాం విద్యార్థి ఎంపిక

పూసపాటిరేగ: ఇటీవల జరిగిన ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో పసుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని జి.భార్గవి ఉత్తీర్ణత సాధించింది. 113 మార్కులతో మండలంలోని ఏకైక విద్యార్థినిగా ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఈ అమ్మాయికి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ. 12వేలు ఉపకార వేతనంగా ఇవ్వనున్నారు. ప్రతిభ కనబరిచిన భార్గవిని ప్రధానోపాధ్యాయులు ఆర్. నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

శత శాతం రుణాలు రికవరీ జరగాలి

రామభద్రపురం: మండలంలో డ్వాక్రా సంఘాలకు మంజూరు చేసిన రుణాల రికవరీ శత శాతం జరగాలని వెలుగు ఎపిఎం రత్నాకర్ సిబ్బందికి ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన స్త్రీనిధి, ఉన్నతి, సిఐఎఫ్ రుణాల రికవరీపై దృష్టి సారించాలని కోరారు. గ్రామ స్థాయిలో ఉన్న ఆడిట్లు పూర్తిచేయాలని, బుక్ కీపింగ్‌లు అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన కొత్త స్త్రీనిధి రుణాల మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సిసి బాలకృష్ణ, వివిధ గ్రామాల ఎంఎస్‌లు పాల్గొన్నారు.

శిథిలావస్థ వసతి గృహాలు పరిశీలన

భోగాపురం: భోగాపురంలో మరమ్మతులకు గురైన వసతి గృహాలను ఎంపిడిఒ చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం విద్యార్థులు ఉంటున్న వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రజాశక్తిలో ప్రత్యేక కథనం ఇటీవల వెలువడింది. దీనిపై స్పందించిన ఆమె వసతి గృహాలను పరిశీలించారు. ప్రస్తుతం విద్యార్థులుంటున్న వసతి గృహంతో పాటు గతంలో శిథిలావస్థకు చేరుకున్న సాంఘిక సంక్షేమ, బిసి వసతి గృహాలను పరిశీలించారు. దీనిపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. ఆమె వెంట ఎఇ బంగారయ్య, వార్డెన్ ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు వాహనాలు ఢీ కొని ఒకరు మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కొప్పెర్ల జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లికి చెందిన లోగింగ నరసింహ (41) అక్కడికక్కడే మృతిచెందగా డ్రైవర్ సారి రమణకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసు అందించిన వివరాలు ప్రకారం...జాతీయ రహదారిపై విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న బొలెరో వాహనం మరమ్మతులు కారణంగా ఆగిపోయింది. అదే రహదారిపై ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు అతివేగంగా వచ్చి వెనక నుంచి బొలెరో వాహనాన్ని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ఉన్న వ్యక్తి మృతి చెందగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 40 మంది ప్రయాణికులతో వస్తున్న బస్సు అతివేగంగా రావడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో గల్లంతైన కార్మికుడు మృతి

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి సముద్రంలో స్నానం చేస్తుండగా గల్లంతైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన అబ్దుల్ కలాం మాలిక్ మృతి చెందాడని స్థానిక ఎస్ఐ సన్యాసినాయుడు మంగళవారం తెలిపారు. సోమవారం గల్లంతయిన యువకుడు మంగళవారం ఉదయాన్నే సముద్రతీరానికి మృతదేహం కొట్టుకొచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం భోగాపురం సిహెచ్‌సికి తరలించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ మస్తాన్‌రావు తెలిపారు. మండలంలో పెద్ద రెండు, జగ్గాల సమీపంలోని కొండపేట వద్ద ఒక ట్రాక్టరును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ముగ్గురు ట్రాక్టర్ డ్రైవర్లను ట్రాక్టర్లను గజపతినగరం పోలీస్ స్టేషన్ అప్పగించినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అనుమతి లేని విద్యా సంస్థలపై కొరడా

- తిరుమల పబ్లిక్, స్రవంతి లిటిల్ సోల్జర్స్ మూసివేతకు ఆదేశం
- డిఇఒ ఆదేశాలతో రంగంలోకి అధికారులు

ప్రజాశక్తి - జామి

మండలంలోని అక్రమంగా నడుపుతున్న ప్రయివేటు విద్యా సంస్థలపై విద్యా శాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఇప్పటికే అక్రమంగా ప్రయివేటు బడులు నిర్వహిస్తున్నారని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ ప్రయివేటు బడులపై తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసుకోవాలని మండల విద్యా శాఖ అధికారులకు ఆదేశించారు. అందులో భాగంగానే ఎం ఇఒలు జయశ్రీ, గంగరాజులు మండలంలోని బాపు హైస్కూల్, శ్రీ తిరుమల పబ్లిక్ స్కూల్, స్రవంతి లిటిల్ సోల్జర్స్ ప్లే స్కూల్‌లను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాపు హైస్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది ఎవ్వరూ లేకపోవడమే కాకుండా ఆఫీస్‌కు తాళాలు వేసి ఉండడం గమనించినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులూ లేకుండా నడుపుతున్న తిరుమల పబ్లిక్ పాఠశాలను, స్రవంతి లిటిల్ సోల్జర్స్ ప్లే స్కూల్ ను కూడా అనుమతులు లేని కారణంగా మూసివేయడానికి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

స్రవంతి లిటిల్ సోల్జర్స్ యాజమాన్య ప్రతినిధిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంఇఒలు జయశ్రీ, గంగరాజు

అడ్డగోలుగా ప్రయివేటు బడులు

ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ మొత్తం మండలంలో 20 పాఠశాలలున్నాయి. ఇందులో తిరుమల హైస్కూల్, స్రవంతి లిటిల్ సోల్జర్స్ ప్లే స్కూల్‌లకు మాత్రమే అనుమతులు లేవని, మిగిలిన వాటికి అనుమతులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాస్తవానికి అత్యధిక పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని విద్యార్థి సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు మొదలుకొని, మౌలిక సదుపాయాలు కల్పన లోప భూయిష్టంగానే ఉన్నాయన్నది బలమైన ఆరోపణ. కానీ ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో తప్ప, ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు మొదలుకొని, యూనీఫామ్, వసతులు లేకుండా వేలకు వేలు హాస్టల్ ఫీజులు ముక్కుపిండి వసూలు చేస్తున్న పరిస్థితి. విద్యార్థుల తల్లిదండ్రులు బలహీనతలను అవకాశంగా మార్చుకుని అడ్డగోలుగా ప్రయివేటు యాజమాన్యాలు ఫీజులు గుంజుకుంటున్న పరిస్థితులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని అక్రమ పాఠశాలలపై కొరడా ఝులిపిస్తే తప్పా, సామాన్యులకు న్యాయం జరగదని ప్రజలు కోరుతున్నారు.

రైతు భరోసా కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అమకాం రైతు భరోసా కేంద్రాన్ని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం. ఆనందరావు, వ్యవసాయాధికారులు టి. సంగీత, బి.సుజాత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్ట విత్తనాలను ప్రతి ఒక్కరూ తమ పొలాల్లో నాటాలన్నారు. పచ్చిరొట్ట వల్ల భూమి సారం పెరుగుతోందని, పలు రకాల నవధాన్యాలను భూమిలో చల్లడం వల్ల భూమిలో తేమ శాతం పెరిగి భూమి సత్తువ పెరుగుతోందన్నారు. ఎఒ నిర్మల మాట్లాడుతూ వరి విత్తనాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామని ముందుగా ఎంటియు 1121 రకం విత్తనాలు ఆర్‌బికెలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ బి. రామకోటి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలతో అవస్థలు

వేపాడ: మండలంలో పగలు, రాత్రి తేడా లేకుండా పవర్ కట్ పేరుతో పలుమార్లు విద్యుత్ కోతలు విధించడంతో వేసవి తాపానికి తట్టుకోలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి 11 గంటల దాటినప్పటికీ విద్యుత్ సరఫరా లేక ఆరుబయట కరెంటు వచ్చేవరకు వేచి ఉండవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదించగా పవర్ కట్ తమ చేతిలో లేదని చెబుతున్నారు. విద్యుత్ కోతల వల్ల వృద్ధులు, పిల్లలు అవస్థలు పడుతున్నారు.

తోటపల్లి కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని ఆమిటి వద్ద తోటపల్లి పిల్ల కాలువను ఎమ్మెల్యే బేబినాయన మంగళవారం పరిశీలించారు. ఆమిటి గ్రామం నుంచి గొలుగువలస వరకు వెళ్లే తోటపల్లి పిల్ల కాలువకు గతేడాది గండిపడిన విషయం తెలిసిందే. అప్పట్లో గండిని తాత్కాలికంగా రైతులు పూడ్చివేశారు. అది శాశ్వత పరిష్కారం కాకపోవడం వల్ల ఈ సంవత్సరం వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పంటలకు కూడా కాలువ నుండి నీరు విడుదల చేసే సమయం ఆసన్న మైందని సమస్యను పరిష్కరించాలని రైతులు ఎమ్మెల్యే బేబీ నాయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన క్షేత్ర పరిశీలన చేవారు. తోటపల్లి ఎఇ, డిఇలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంత ఖర్చవుతుందని అడిగి తెలుసుకున్నారు. శాశ్వత పరిష్కా రానికి కావలసిన నిధులు వీలైనంత త్వరలో మంజూరు చేయి స్తానని త్వరితగతిన ఈ పని పూర్తి చేస్తానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వరరావు, ఏ. సురేష్, ఆ గ్రామ నాయకులు లవన్ కుమార్, ఎంపిటిసి ఆనందరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బేబినాయన

సాగునీటికి తొలి ప్రాధాన్యత

బొబ్బిలిరూరల్ : రైతులకు సాగు నీరు అందించేందుకు తొలి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మంగళవారం అలజంగిలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు తోటపల్లి కాలువలో పూడికలు, వర్షాకాలంలో గండ్లు పడుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామని, అలజంగి జంక్షన్ వద్ద ఆర్ అండ్ బి రోడ్డు పాడైపోయిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి కాలువ లైనింగు, పూడికలు తీతకు అవసరమైన నిధులపై నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి కాలువ నీటి పారుదల డిఇలు కుమార్, రఘునాధరావు, ఆర్‌అండ్‌బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఈ నెల 17 నుంచి 21 వరకూ మధ్య ప్రదేశ్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా ఉమెన్ ర్యాంకింగ్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కొండవెలగాడకు చెందిన బాలి నీరజ పతకాలు సాధించింది. 45కిలోల విభాగంలో పాల్గొన్న ఆమె 56కిలోల స్నాచ్, 64 కిలలో క్లీన్ అండ్ జర్క్ మొత్తం 120 కిలోల బరువులు ఎత్తి సబ్ జూనియర్ విభాగంలో రజిత పతకం, జూనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈమెను రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రెటరీ, వైస్ ప్రెసిడెంట్ ఎం లక్ష్మీ, దీంసబాబు, బడే వెంకట్రామయ్య, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బెల్లాన నాగలక్ష్మి, సెక్రెటరీ చల్ల రాము, అసోసియేషన్ మెంబర్స్ అభినందించారు.

పతకాలు సాధించిన నీరజ, శ్రీపాద శ్రీజ

ఇండోర్ వెయిట్ లిఫ్టింగ్‌లో వెండి పతకం

మధ్య ప్రదేశ్ ఇండోర్‌లో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ మహిళల జోనల్ ర్యాంకింగ్ టోర్నమెంట్ పోటీల్లో సెంచూరియన్ విశ్వవిద్యాలయం బిబిఎ విద్యార్థి శ్రీపాద శ్రీజకు వెండి పతకం లభించింది. దీంతో మంగళవారం ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ తదితరులు అభినందనలు తెలిపారు. శ్రీజ వెయిట్ లిఫ్టింగ్ 40 కిలోల విభాగంలో పాల్గొని స్నాచ్‌లో 40 కిలోలు, క్లీన్ జర్క్‌లో 55 కిలోలు కలిపి మొత్తం 95 కిలోలు బరువెత్తి వెండి పతకం సాధించింది. ఈ సందర్భంగా కోచ్ అర్జున్‌ను, నారాయణను సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ తదితరులు అభినందనలు తెలిపారు.

ముసుగులు తొలగించరా?

ఎన్నికల కోడ్ ముగిసినా అధికారుల అలసత్వం

ప్రజాశక్తి - రామభద్రపురం

సార్వత్రిక ఎన్నికల వేళ ఎన్నికల కమిషన్ ఈ ఏడాది మార్చి 17నుంచి జూన్4 వరకు మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమలు చేసింది. దీనిలో భాగంగా రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలనే నిబంధనలు అమలు చేశారు. అయితే కోడ్ ముగిసిన వెంటనే ఆ ముసుగులు తొలగించాల్సి ఉన్నప్పటికీ నేటికీ ముసుగులు తొలగించడంలో సంబధిత శాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండలంలో పలుచోట్ల దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించలేదు. కోడ్ ముగిసి నేటికి సుమారు రెండు వారాలు కావస్తున్నా ముసుగులు తొలగించక పోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ ఆరికతోట బస్ స్టాప్ వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగు వేయకపోవడంపై విమర్శలు వచ్చాయి. ఇప్పుడు అదే విగ్రహానికి ముసుగు తొలగించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. బూసయవలస జాతీయ రహదారి పక్కన ఉన్న వైఎస్ విగ్రహానికి ఉన్న ముసుగును కూడా తొలగించలేదు. ఇలా చాలా చోట్ల అధికారులు ముసుగులు తొలగించడంలో అశ్రద్ధ చూపడం వారి పనితీరుకు నిదర్శనం. ఇకనైనా అధికార యంత్రాంగం స్పందించి కోడ్ ముగిసిన నేపథ్యంలో విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ముసుగుతో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం

గ్రామాల్లో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఎంఇఒ2 వి.శ్రీరామ్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ర్యాలీ చేశారు. విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ 6 నుండి 18 సంవత్సరాల విద్యార్థులందరూ బడిలో ఉండాలని, ప్రాథమిక విద్యను అభ్యసించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను తెలియజేస్తూ అందరూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: ర్యాలీ చేస్తున్న ఎంఇఒ, తదితరులు

భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎంఇఒ

వేపాడ: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఎంఇఒ బాలభాస్కరరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం గొల్లపూడి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి భవిత సెంటర్‌లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిరుజోగి సత్యవతి, పాఠశాల హెచ్‌ఎం సిహెచ్ అర్జున్‌రావు, ఐఆర్‌పిలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: 'నేను బడికి పోతా' అనే కార్యక్రమం ఆవశ్యకత అందరు తెలుసుకోవాలని ఎంఇఒ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్య యొక్క గొప్పతనాన్ని, విద్య ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా పిల్లల తల్లి తండ్రులను కలసి విద్య గొప్పదనాన్ని వివరించినట్లయితే తప్పనిసరిగా ప్రతి పిల్లవాడు రోడ్ మీద తిరగ కుండా తమంతట తామే 'నేను బడికి పోతా' అనే ఆలోచనకు వస్తారాని తెలిపారు. ఈ కార్యక్రమం ఎంపిడిఒ పావని, తహశీల్దార్ పద్మావతి, ఇఒపిఆర్‌డి, ఎంఇఒ2 ప్రసాదరావు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్‌లో ఇంటర్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - జామి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ తరగతులు ఎట్టకేలకు ప్రారంభమ య్యాయి. నిన్నటి వరకూ పదో తరగతి వరకూ చదువుకున్న విద్యార్థులకు రెండేళ్ల పాటు కాలేజీ చదువులు (ప్లస్ 2) అభ్యసించే అవకాశం రానే వచ్చింది. ఈ నేపథ్యంలోనే హైస్కూల్లో ఎంపిసి, సిఇసి గ్రూపులు ఈ ఏడాది నుంచి ప్రారంభించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మెరుగైన అధ్యాపకుల బృందంతో పాటు ఇంటర్ చదువులకు కావాల్సిన సౌకర్యాలు కలిపిస్తామని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే పలువురు విద్యార్థులు ఇంటర్ చదువులకు గానూ, జామి హైస్కుల్లో చేరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేయను కోవాలని అధికారులు కోరుతున్నారు.

భారమైన ఇంటర్ చదువులు

కార్పొరేట్ చదువులు కాలంలో ఇంటర్ చదవడం ఖర్చుతో కూడుకున్న పని. కనీసం రూ.50 వేలు నుంచి రూ. లక్ష మధ్య ఒక ఏడాది చదువుకు వెచ్చించాలి. రెండేళ్లు చదవడానికి అవకాశం లేక ఎక్కువ కుటుంబాల్లో ఆడపిల్లలను చదువులు ఆపేసి, పెళ్లిళ్లు చేస్తున్న పరిస్థితి. వ్యవసాయ కుటుంబాలలో అబ్బాయిలను పొలం పనులకు పంపుతున్న తీరు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం జూనియర్ కాలేజీ చదువులు సొంత ఊరిలో ఉండడం, పది తరువాత డ్రాపౌట్స్‌ను ఆపే అవకాశం ఉంది. ప్రతీ పేద విద్యార్థి ఇంటర్ చదువును పూర్తి చేసే అవకాశాన్ని అందిపుచ్చు కోవాలని అధికారులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలోనే మండల స్థాయి అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, స్థానిక ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల సూచనలు సలహాలు తీసుకుని ఇంటర్ చదువులు విద్యార్థులకు అందించే దిశగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రజలు కోరుతున్నారు.

భూ హక్కు చట్టం రద్దుపై హర్షం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గత వైసిపి ప్రభుత్వం జారీ చేసిన భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన ప్రభుత్వం రెండో సంతకం చేయడం పట్ల ఎస్.కోట న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి జి.సూరిదేముడు, బి.సత్యన్నారాయణ ఆధ్వర్యంలో కోర్టు పున్నప్రారంభ సమావేశం బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరిదేముడు మాట్లాడుతూ నూతన భూహక్కు చట్టం రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా పలు కోర్టుల న్యాయవాదులు సుమారు 150 రోజులకు పైగా నిరాహారదీక్షలు, ఆమరణదీక్షలు, నిరసనలు చేసామని, ఆ సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని చంద్రబాబు ప్రకటించారన్నారు. అనుకున్న విధంగా అధికారంలోకి వచ్చిన మరుక్షణం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై రెండో సంతకం చేయడం శుభ పరిణామం అని ధన్యవాదాలు తెలియజేస్తూ తీర్మానం చేశారు. అనంతరం న్యాయవాదులకు అధ్యక్షుడు సూరిదేముడు మిఠాయిలు పంపిణీ చేశారు.

ముందుగా కోర్టు పున్నప్రారంభం పురస్కరించుకుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బి.సత్యన్నారాయణ ఆధ్వర్యంలో న్యాయమూర్తి కుమారి సబ్బవరపు వాణిని న్యాయవాదులు కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గేదెల ప్రకాష్, బి.త్రిమూర్తులు, మామిడి చంద్రశేఖర్, డబ్ల్యు.ఎన్.శర్మ, వారాది ఈశ్వరరావు, టివిఆర్ మూర్తి, ఎల్.అప్పారావు, ఆర్.సత్యనారాయణ, బివిఎస్ రామారావు, సిహెచ్‌ఆర్ఎ నాయుడు, జి.చిట్టిబాబు, బి.వెంకటరావు, బోని శేఖర్, బొబ్బిలి రామకృష్ణ, ఎం.అనూరాధ, వసంత శ్రీనివాసరావు, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

వీధుల్లో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని వీదుల్లో కొట్టం పిహెచ్‌సి సిబ్బంది మంగళవారం దోమల మందు పిచికారీ చేశారని ఎస్‌కోట సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 శాతం ఎసియమ్ పిచికారీ చేయడం వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని, ఈ ద్రావణాన్ని ప్రతి ఇంటిలోపల కొట్టించుకోవాలని, దీని ప్రభావం 10 వారాల నుంచి 12 వారాల వరకు ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డు మెంబర్ చిప్పాడ శేషగిరిరావు ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి దోమల మందు అందరూ ఇంటిలోపల కొట్టించుకొనేటట్లు అవగాహన కల్పించారు. అందరూ ఫ్రైడే, డ్రై డే నిబంధనలు పాటించాలని, దోమలు కుట్టకుండా విధిగా దోమ తెరలు వాడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రామసత్యం, ఆరోగ్య కార్యకర్తలు శంకర్, రామకృష్ణ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

దోమల మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

నీటి కాలుష్యంపై అవగాహన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

నీటి నాణ్యత, పర్యవేక్షణ పైన గ్రామ స్థాయి ఫీల్డ్ టెస్ట్ కిట్ సభ్యులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రమీల దేవి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని వాటర్ ఎయిడ్ సంస్థ 5 గ్రామ పంచాయతీలలోని ఏఎన్ఎమ్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లకు, ఆశా కార్యకర్తలకు నిర్వహిస్తున్నారు. డాక్టర్ ప్రమీలా దేవి మాట్లాడుతూ నీరు కలుషితం అవ్వడం వల్ల డయేరియా, పచ్చకామెర్లు, టైఫాయిడ్ మొదలగు వ్యాదులు వ్యాప్తి చెందుతాయని మనం తాగే నీరు స్వచ్ఛంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సూక్ష్మ క్రిములు, రసాయనాలు ఉండకూడదని గ్రామ స్థాయిలో నీటి నాణ్యత పర్యవేక్షణ, నిఘా అవసరం అని తెలిపారు. ఆరోగ్య పర్యవేక్షకులు ఉమాపతి మాట్లాడుతూ నీటిని శుద్ధి చేయడానికి ప్రాథమిక పద్ధతులు, కాలుష్య కారణాలను వివరించారు. వాటర్ ఎయిడ్ ఫెసిలిటేటర్‌లు వెంకటరమణ, అప్పలకొండమ్మ, నీటి నాణ్యతను, ప్రభావితం చేసే అంశాలు, నీటినాణ్యత అంచనా ప్రమాణాలు, పంచాయితీ, బ్లాక్ స్థాయి కమిటీ సభ్యుల, పాత్ర, బాధ్యతలు విసదీకరించారు. ఈ శిక్షణలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు వేదమని, సూపర్‌వైజర్ నానమ్మ, ఆరోగ్య సహాయకులు ఆర్.వి. రమణ పాల్గొన్నారు

కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ధర్నా

విజయనగరం టౌన్ : పెదమానాపురం పశువుల సంతకు నిబంధనలకు విరుద్ధంగా లైసెన్స్ మంజూరుకు తీర్మానం పై సంతకం చేసిన గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జి. చంద్రమౌళిని సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ బసవ రవికిరణ్ కు వినతినిచ్చారు. ఈ సందర్భంగా లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ పెదమానాపురం సంతలో ఎటువంటి మౌలిక సదుపాయాలు, సిపి కెమెరాలు, ర్యాంపులు, వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఫిట్నెస్ సర్టిఫికెట్‌లు లేనప్పటికీ కాసులకు కక్కుర్తి పడి తీర్మానం పై సంతకం చేశారన్నారు. దీని వలన వేలాది గోవులు సంతల నుండి కసాయి శాలలకు తరలిపోతున్నాయన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

విజయనగరం: తామరాపల్లిలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆ శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.నందకుమార్ తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 15న ప్రచురించిన వార్తపై స్పందించి వెంటనే తమ శాఖ డిఇ., రికార్డు అసిస్టెంట్, వర్క్స్ ఇనస్పెక్టర్ లతో కలసి తామరపల్లి ఇన్ స్పెక్షన్ బంగ్లాను పరిశీలించామని పేర్కొన్నారు. అతిథి గృహం స్థలంలో కలప నిల్వ చేసిన విషయాన్ని, పశువులను కట్టేందుకు వినియోగిస్తున్న అంశాన్ని, చిరు వ్యాపారులు బడ్డీ కొట్లు నిర్వహిస్తున్న అంశాలను గమనించి వారిని వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించామని తెలిపారు. ఇందులోని ఆక్రమణల తొలగింపునకు తక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.